రిమోట్

సి.సుజాత

"నువ్వేం అనుకోనంటే నీకో మాట చెప్పనా?"

"చెప్పు!"

"నువ్వెలాగైనా ఓవర్ ఇమోషనల్.."

"ఏం అయితే..."

విశాల ప్రేమగా ప్రకాష్‌ను ముద్దుపెట్టుకుంది.

ప్రకాష్ మొహం చిట్లించాడు. దాదాపుగా తన మీదకు వాలిపోయిన విశాలను పక్కకు జరిపేడు.

విశాల ఏమిటన్నట్లు చూసింది.

ప్రకాష్ కళ్ళు మరల్చుకొన్నాడు. కాస్త విసుగొచ్చింది. ఎల్లా చెప్పటం? లేకపోతే ఎలా భరించటం... అదేమిటసలు. సినిమాల్లో వాంప్ పాత్రలాగా... మీద పడిపోవటం...అదేదో చర్చనీయాంశంలాగా తన ఫీలింగ్స్ చర్చకు పెట్టడం. బాబోయ్ తనవల్లకాదు. తనసలు మామూలుగా - ఆడవాళ్ళలాగా ఉండచ్చు కదా. అదే అనేశాడు.

"అబ్బా విశాలీ నువ్వు కాస్త ఆడతనంతో ఉంటే బావుండు..."

విశాల నవ్వేసింది. అలా విలాసంగా వాలి పడుకొంటే చక్కని రంగు, కవ్వించే కళ్ళు, కబుర్లు, తీరైన శరీరం నిజంగానే బావుంది. అయితే ఏదో ఎక్కడా అపశృతి అర్థం అయీ, కాకుండా, మనసుని బాధిస్తోంది. చిరాగ్గా ఉంది. అంతే... ఆడదాని లాగా లేనా... విశాల రెట్టించింది.

"ఉన్నావు... మరీ... మన ఆఫీసులో లేడీస్‌ను చూస్తావుగా. అబ్బో చాలా సెన్సిటివ్‌గా ఉంటారు. మేనేజర్ సెలవివ్వకపోయినా కళ్ళనీళ్ళొస్తాయి. మనసు కరిగిపోయో, చిరాకు పుట్టో ఇవ్వాలనిపిస్తుంది కదా. ఇందాక నువు పడీపడీ చూస్తూ కామెంట్లు చేస్తుంటివే అలాటి పుస్తకాలు కన్నెత్తి అయినా చూడగలరా వాళ్ళు.... మన రీడింగ్ రూమ్‌లో మాగజైన్లలో కాస్త వెకిలిగా ఉన్న ఫోటో కనిపిస్తే అలా మనవైపు ఇబ్బందిగా చూసేసి పుస్తకం నాక్‌గా అక్కడ తిప్పి పెట్టేస్తారు. మనం అది గమనించామేమోనని కంగారుపడుతుంటారు. సిగ్గుపడిపోతారు. నువు ఆఫీసర్‌వి కనుక నీకు ఇవన్నీ కనిపించకపోవచ్చు. వర్షం వచ్చినా, కాస్త ఆఫీసులో లేటయినా, కంగారుపడి పిల్లలు ఎలాగున్నారో అని బాధపడిపోతుంటారు..."

ప్రకాష్ ప్రసంగం వింటున్న కొద్దీ విశాల మొహంలో నవ్వు నెమ్మది నెమ్మదిగా ఆరిపోయింది. పెళ్ళి తరువాత ఈ నెలరోజుల అనుభవంలోనూ ప్రకాష్ మాటిమాటికి ఎందుకలా మూడీగా అయిపోతాడో అర్థం అయ్యీ కానట్లుండేది.

"ప్రకాష్ నేను నీకు నచ్చలేదా?"

ప్రకాష్ సిగరెట్ వెలిగించుకొని, అగ్గిపుల్ల విసిరేందుకు కిటికీ వైపు తిరిగి, చివుక్కున వెనక్కి తిరిగాడు.

"అదేం ప్రశ్న... నేనలా అన్నానా... కాకపోతే నీకు కాస్త ఉత్సాహం..." అంటూ నాన్చేశాడు మిగిలిన మాటలను.

అటు తిరిగి రిమోట్ చేతిలోకి తీసుకున్నాడు. టి.వి. స్క్రీన్ మీద చకచకా ఛానెల్స్ మారిపోతున్నాయి. రంగు రంగులలో కళ్ళ ముందు వలయాలు తిరిగినట్లుగా. రిమోట్ మీద అతని వేలు ఒక్కో బటన్ నొక్కి చూస్తోంది. తెల్లని అరచేతిలో నల్లని రిమోట్ బలంగా ఉన్న బొటనవేలు, తీర్చిదిద్దినట్లున్న గోరు బటన్స్ మీద కదులుతుంటే తన గుండె నొక్కేసినట్లుంది విశాలకి. తన ఆలోచనలు, ఫీలింగ్స్, ఆవేదనలు, ఆశలు కనిపించని రిమోట్ ఏదో కంట్రోల్ చేస్తున్నట్లు. ఇప్పుడు పూర్తిగా అర్థం అయింది.

అస్తవ్యస్తంగా విసిరేసిన మల్లెపూల చెండులా మంచం మీద విశ్రాంతిగా స్వేచ్ఛగా పడుకుని ఉన్న విశాల తప్పు చేసినట్లు కాళ్ళు, చేతులు దగ్గరికి తీసుకుంది. కావాలని వొళ్ళంతా కనిపించే నైటీ వేసుకొంది. సెంట్ స్ప్రే చేసుకొంది. మెడ కింద గంధం రాసుకుంది. వొళ్ళంతా కోరికతో జ్వలించి పోతుంటే ప్రకాష్‌ను ప్రతి అణువు కోరుకుంటుంటే, అతని ఆలస్యం ఒక్క నిముషం కూడా భరించలేని ఆవేశంతో, బిగించిన వీణ తీగలాగా శరీరం పలికే రాగ రసానంద లహరిలో మునిగి తేలిపోతున్న మనసు ఉలిక్కిపడి మైకంలోంచి బయటపడింది. నెలరోజులుగా తను ప్రకాష్ కోసం శరీరాన్ని ఎంత అలంకరించుకుంది. అతనిలో కరిగిపోయేందుకు ఎంత సమాయత్తమయిందో తలుచుకొంటే సిగ్గుగా ఉంది విశాలకి. మిగతా ఆడవాళ్ళలాగా తను లేదంటున్నాడు ప్రకాష్. రీడింగ్ రూమ్ మగవాళ్ళందరి కోసమే అన్నట్లుంటుంది ఆఫీస్. సిగరెట్ పొగలు, వాదనలతో దద్దరిల్లిపోతూ ఇక్కడ ఆడవాళ్ళకి ప్రవేశం లేదన్నట్లుంటుంది. అధవా ఏ పేపర్ కోసం వెళ్ళినా, వెంటనే ఎవరో ఒకరు లేచి వచ్చి మర్యాదగా ఆ పేపర్ అందించి ఊరుకుంటారు. ఒకవేళ పొరపాట్న ఏ అమ్మాయైనా చర్చకు దిగితే, వాదన పెరిగిన కొద్దీ అన్‌పార్లమెంటరీ భాషలో ఆవేశం వచ్చేస్తుంది వాళ్ళకి. వాళ్ళని దబాయించలేక నోరు మూసుకుని బయటకు వస్తారు వీళ్ళు. సున్నితత్వం, మర్యాద, హద్దులు, ఇంకా ఎన్నెన్నో కంచుగోడల వెనకాల, గాయపడిన జాడలు కనిపించనివ్వకుండా పోరాటం మధ్యలో కత్తులు పారేసి వెనుతిరిగినట్లు, ఉండాలి. ఆఫీసు కొనుగోలు చేసిన మాగజైన్‌లో కాస్త అతిగా ఉన్న బొమ్మవైపు కూడా కన్నెత్తి చూడలేని ఆడవాళ్ళను అంగీకరించింది ప్రకాష్ మనసు. వాళ్ళ వినయాన్ని, సిగ్గునీ, మెచ్చుకొంటున్నాడతను. ఈ నెలరోజులూ తను ఎలాగుంది? అచ్చం ఇంట్లో ఇంకా ప్రకాష్‌లాగా ఉంది.

మరి గడిచిపోయిన రెండేళ్ళ మాట. ఒకళ్ళంటే ఒకళ్ళు ఆపేక్ష చూపించుకొన్నారు. ఇష్టపడ్డారు. పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకొన్నారు. ఈ మధ్యకాలంలో అతను ఎన్నోసార్లు ఆవేశపడ్డాడు. తను అంగీకరించలేదు. ఇష్టపడలేదు. పెద్ద కారణమూ లేదు. ఒక పద్ధతికి అలవాటు పడింది. ఆఫీసు పని, తరువాత తన పిహెచ్.డి నోట్సులు, ట్రైనింగ్ పిరియడ్ కావటంతో ఎప్పుడూ టూర్లు, సెమినార్లు ఉన్న కాస్త సమయం ఏదో ఒక పని ఉండటం. అతనికి అలా ఉన్న విశాల నచ్చింది. జీవితానికి ఒక పద్ధతి, ఒక డిసిప్లిన్ ఉండాలనుకోవటం అతనికి ప్రాతివత్యం అనిపించి ఉండవచ్చు. అసలు ఆడవాళ్ళ గురించి ఇతనికేం తెలుసు. జీవితం అప్పుడే విరిసిన పూవులాగా తాజాగా, అందంగా, కళాత్మకంగా, స్వేచ్ఛగా ఉండాలి. విభిన్న దృక్పథాలు, దృక్కోణాలు, ఆలోచనలు, ఆశలు. ఒక్కో వ్యక్తి ఒక్కో రకంగా! పెళ్ళి... ఇద్దరు వ్యక్తులను కలిపి వుంచే బంధంలోకి, ఒక టాస్‌వేసి ప్రవేశిస్తున్నాం. పడేది బొమ్మా? బొరుసా? మనకేం కావాలి? మనకేం దొరుకుతుంది? ఒకళ్ళ కొకళ్ళు అర్థమయ్యే అవకాశమూ, అది అనుభవంతో తెలుసుకోనేదీ కాదు. అచ్చం జూదం ఆడినట్లు, అద్దింట్లోకి అడుగుపెడుతున్నాం. జీవితమనే ఎరీనాలోకి అడుగుపెట్టడమే కానీ, వెనుతిరిగి పరిగెత్తుకు రావటం ఎలా? చచ్చేవరకూ పోరాడవలసిందే.

ప్రకష్ వెతికి... వెతికీ ముద్దులు, కౌగిలింతలూ ఉన్న ఇంగ్లీష్ మూవీ ఏదో సాధించాడు. సిగరెట్ పొగ స్పీడ్‌లా వదులుతూ సినిమాలో లీనమైపోయాడు. అటు తరువాత అతని ఉద్రేకాన్ని భరించే ఒక ఆడది కావాలి. అంతేగానీ తనతో రొమాన్స్‌కైనా పోటీపడే సరిసమానురాలు కాదు. విశాల నెమ్మదిగా మంచం దిగింది.

"విశాలా అన్నం తినేద్దాం... బ్రహ్మాండమైన మూవీ క్విక్... పదినిముషాల్లో సిద్ధం చేయాలి..."

విశాల మధ్య హాలులోకి వచ్చింది. హాలంతా చిందరవందరగా ఉంది. సోఫాలో అడ్డదిడ్డంగా దిండ్లు. తాగి వదిలేసిన గ్లాసులూ, సిగరెట్ల గుడ్డలతో నిండిన యాష్‌ట్రేలు. గంట క్రితం ఫ్రెండ్స్‌తో గదంతా కళకళలాడింది. వాదనలు, నవ్వులు, రాజుతో మీరానాయర్ 'కామసూత్ర' సినిమా గురించి, బాసుభట్టాచార్య తీసిన 'ఆస్తా' సినిమా గురించి తను గట్టిగా వాదించటం ప్రకాష్ ఒకటి రెండుసార్లు విసుగ్గా చూశాడు. రెండుసార్లు అబ్బా ఆ అరుపులు ఆపి కాఫీలు ఇవ్వకూడదూ అన్నాడు. రాజుతో వాదించే ఉద్రేకంలో ఇప్పుడు రెండోసారి నేను పెట్టను పొమ్మంది. ఆ సబ్జెక్టు మీద



> వాదనలు, నవ్వులు, రాజుతో మీరానాయర్ 'కామసూత్ర' సినిమా గురించి, బాసుభట్టాచార్య తీసిన 'ఆస్తా' సినిమా గురించి తను గట్టిగా వాదించటం ప్రకాష్ ఒకటి రెండుసార్లు విసుగ్గా చూశాడు. రెండుసార్లు అబ్బా ఆ అరుపులు ఆపి కాఫీలు ఇవ్వకూడదూ అన్నాడు. రాజుతో వాదించే ఉద్రేకంలో ఇప్పుడు రెండోసారి నేను పెట్టను పొమ్మంది.

అంతసేపు వాదనలేమిటి? అంటూ వారించాలని చూశాడు. రాజు ఆ రెంటిపైనా వచ్చిన ఆర్టికల్ ఏదో చదువుతున్నాడు. తనిక వినిపించుకోలేదు. అప్పటి నుంచి అలా మూడీగా కూర్చున్నాడు. ఈ నెలరోజుల్లో ఇలాటి పాఠాలు పరోక్షంగా విన్నది కానీ అనుమానం రాలేదు. నేను తప్ప ప్రతివాడూ నీతో మాట్లాడతాడంటే ఆ అలక చూసి ముచ్చటపడింది. తనను నిముషం కూడా విడిచి ఉండలేని అతని అనురాగాన్ని తలుచుకొని అతన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. ఒక మత్తు... ఒక ఇష్టం అతన్ని ఎంతగా తన మనసులో గాఢంగా ప్రేమించిందంటే దాసిలా అతన్ని సేవించాలనిపించేది. ఒక కొత్త ఉత్సాహంతో అతనికంటే ముందు ఆఫీస్ నుంచి పరిగెత్తుకు వచ్చి, ఇల్లంతా సర్ది, మంచి మంచి వంటలు వండి, కళాత్మకంగా అవన్నీ అమర్చి జీవితం అందమైన దృశ్యంలాగా, ఉప్పొంగిన, ఉద్రేకంలాగా, పెల్లుబికే ఉత్సాహంలాగా, జలపాతంలాగా... జీవితం ఒక అందమైన దృశ్యంలాగా ఉండాలనే ఆకాంక్ష. అభిమానులతో కొన్నికొన్ని తేడాలుండచ్చు. పాపం అందరు ఆడవాళ్ళు ఇలాగే ఆలోచిస్తారు కాబోలు, బానిసల్లాగా తమంతట తాము, తన సేవనీ, శరీరాన్ని అర్పించుకొని, చివరికి బానిసల్లాగే ఉండిపోతారు.

విశాల సోఫాలో కూలబడింది.

ఇప్పుడు తనెలా ఉండాలి. అచ్చం ప్రకాష్‌లా ఉండేందుకు ఇక వీలవదు. ప్రకాష్ నీడలా మటుకే ఉండాలి. ఇవ్వాళ రాత్రి నిన్ను నిద్రపోనివ్వను అనేంత దూరం వెళ్ళకూడదు. ఆ మాట అనే అవకాశం ప్రకాష్‌కే ఉండాలా? విశాలకి నవ్వొచ్చింది. తనెంత పెసిమిస్టిక్‌గా ఆలోచిస్తోంది. ఒక బాధ మనిషిని కుంగదీస్తే ఆ బరువు అతన్ని కిందకే దిగజారుస్తుంది కానీ తలెత్తనివ్వదేమో? 'మాడెస్టీగా ఉండాలంటాడు ప్రకాష్'. ఎందుకంత రెచ్చిపోవటం మాటకి మాట బదులివ్వటం, గలగలమని మోగటం తగ్గు, తగ్గు. కళ్ళు కిందికి తెచ్చుకో. ఇదే అతని స్లోగన్. కాపురానికి వచ్చిన తరువాత తను వొళ్ళంతా హూనమయ్యేలా ఇల్లంతా కడిగి సర్ది వస్తువులన్నీ తీరుగా అమర్చితే

'ఎలాగయినా ఇంట్లో ఆడవాళ్ళున్న తీరే వేరు' అని అతను మెచ్చుకొంటే అది కాంప్లిమెంటుగానే తీసుకుంది. ఆ సాయంత్రం దొడ్డివేపు ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలన్నీ చూస్తూ అక్కడ మంచి తోట ఎలా వేయాలో ప్లాన్లు వేస్తుంటే, అక్కడున్న రాళ్ళ గుట్టల మధ్యకి ఏదో సరసరా వెళ్ళిపోయినట్లనిపించింది. రాత్రివేళ పాములు వస్తాయేమోనని, దొడ్లో లైటు లేకపోవటంతో, కాస్త టార్చిలైటుతో సాయం రమ్మని అడిగినందుకు ఇప్పుడూ తయారైపోతాడు. తనకి చీకటంటే భయమనే సంగతి మాటిమాటికీ గుర్తుచేసి తనను ఎంత అపురూపంగా చూడగలగడం, ఉదాహరణగా వద్దన్నా తనకు సాయం వస్తాడు. తన మీద ప్రకాష్‌కు శ్రద్ధ అనే భావనే తనను సంతోషంలో ముంచెత్తింది. కానీ, తను ప్రకాష్‌కి అబలగా మాత్రమే ముద్దొస్తుంది అని అర్థం కాలేదు. తనను తాను ఇలా మలుచుకొనేందుకు పాతికేళ్ళు పట్టింది. విశాలకి నెర్వస్‌గా అనిపించింది. అసంకల్పితంగా పైట సర్దుకోబోయింది. నైటీ వేసుకొన్న సంగతి గుర్తుకొచ్చింది. లేచి వెళ్ళి స్టాండ్ మీద ఉన్న టవల్ తెచ్చుకొనేదాకా మనసు శాంతించలేదు. చేతులు కాళ్ళు వణికిపోతున్నట్లుంది. అమ్మ అత్తా గుర్తొచ్చారు. ఇరవై ఏళ్ళకే పెళ్ళయిపోయి, భర్తపోతే అన్నగారి పంచన చేరిన అత్త, తిన్న తిండికి ముప్పైరెట్లు పనిచేస్తూ మోడులా బతికే అత్తకి, ధైర్యం, చొరవా లేకపోవటంవల్లే బతుకంతా చీకట్లోనే తెల్లవార్చవలసి వచ్చింది. తన బ్రతుకు తాను బ్రతకగలననే ఆలోచన కూడా ఆమెకి వచ్చింది కాదు. ఆమెను చూస్తూ బ్రతికింది తను. ఆమెలాగా ఎందుకు ఉండకూడదో ఎవరూ చెప్పకుండానే తనకు అర్థం అయింది. జీవితం ఒక దీక్ష, ఒక తపస్సు. ఫస్ట్‌క్లాసులు తెచ్చుకోవడం, పరీక్షలన్నీ పాసయిపోవటం, ఆఫీసర్ ఉద్యోగం సంపాదించటం వరకూ కొనసాగిందా యజ్ఞం. మొదటి నెల సంపాదన తన చేతిలో పడ్డ తరువాతే తనకు ఊపిరి తిరిగింది. తన శక్తికి, తన చాకిరికి తగిన ప్రతిఫలం. జీవితాంతం అత్త చేసిన చాకిరికి ఎంత మూల్యం కట్టవచ్చు. ఆమె కుటుంబంలో ఒక పనిముట్టు. పోనీ అమ్మ ఉంది కదా. అమ్మ మటుకు అత్తకంటే ఏం మెరుగు. నాన్న వెనకాల జరీ చీరె కట్టుకొని, గుడికీ, సినిమాకి వెళ్ళటం, ఒక్కటే ఆమె అత్తకంటే మెరుగని చెప్పుకొనేందుకు. రేపటి రోజు కోసం, ఈ సాయంత్రం నుంచే ఏర్పాట్లు చేయటం, పిల్లల్ని పెంచడం ఆమె విధులు కర్తవ్యాలు. చివరకు పది పైసలు ముష్టివాడి చేతిలో పెట్టాలన్నా ఆమె కళ్ళు నాన్నకోసం తిరగాల్సిందే. ఏ అనాథాశ్రమానికైనా, ఒక్క రూపాయి చందా ఇవ్వాలన్నా, వారు లేరు కాసేపాగి రండి అన్న సమాధానం ఇవ్వాల్సిందే. అయినా, వాళ్ళిద్దరూ హాయిగానే ఉన్నామన్న భ్రమలోనే బ్రతికారు. పరాధీనమైన వాళ్ళ జీవితాల గురించి వాళ్ళకి పట్టలేదు. అసలు ఆలోచించలేదు. ఏ పురాణకాలపు పతివ్రతలకూ తీసిపోని తన భార్యను నాన్న బాగానే చూసేవాడు. ఆమె ఏదైనా కోరిక కోరగానే, తనకు అది సబబని అనిపిస్తేనే ఆమె కోరిక తీర్చేవాడు. తనకీ, తన పిల్లల అవసరాలు, ప్రపోజల్స్ పెట్టడం వరకే అమ్మకు చాతనైన విద్య. నాన్న ఆమోదముద్ర కోసం ఇంటిల్లిపాదీ ఎదురుచూడటం చాలా సంవత్సరాల అనుభవం. తను కోరుకుంది అచ్చం నాన్నలాగా ఉండాలని. ఉద్యోగం చేయటం, సంపాదించటం, అనే రెండు ప్రత్యేకమైన క్వాలిఫికేషన్స్‌తో అత్తను, అమ్మను తన కనుసన్నల్లో ఉంచిన నాన్న శక్తి తనూ సంపాదిస్తే తనకు వస్తుందనుకొంది. పాతికేళ్ళు వచ్చేవరకూ ఒక దీక్షతో కృషి చేసింది. ప్రకాష్ అభిమతం అర్థం అయ్యాక, ప్రకాష్ కోరికలో కనిపించే ఇంకో కోణం, మెత్తని కత్తిలాగా విశాల గొంతులో దిగింది. తన బరువు, ఉద్యోగం హోదా, ప్రకాష్ వంటి ఆఫీసర్ భర్తను పొందేందుకు సరిపోయింది. ఇప్పుడు భార్యగా నీ ఉనికి నిరూపించుకోమంటున్నాడు ప్రకాష్. విశాల మళ్ళీ పైటలా వేసుకున్న టవల్‌ను సవరించుకొంది. అలా సర్దుకోవాలని వొళ్ళంతా చీరెలో దుప్పట్లో దాచుకోవాలనే కోరిక విశాల నరనరాల్లో పాకుతోంది.

విశాలీ భోజనాలు చేద్దామా?

ప్రకాష్ బెడ్‌రూమ్‌లోంచి కేక పెట్టాడు.

విశాల సమాధానం చెప్పలేకపోయింది. నెర్వస్‌గా ఉంది. రక్తం వేగంగా పరుగులు తీస్తోంది. శక్తి నెమ్మదిగా జారిపోతుంటే వళ్ళంతా చచ్చుబడినట్లు అనిపిస్తోంది. శరీరం అంతా కప్పుకోవాలి. పైట జారిపోతుందేమో సర్దుకోవాలి. మెదడు పదేపదే కోరుతోంది. విశాల శక్తి కూడదీసుకుని వణుకుతున్న చేతులతో డ్యాక్టర్ ప్రశాంతి కోసం ఫోన్ చేసింది. అటు నుంచి ప్రశాంతి నవ్వుతూ పలకరిస్తోంది. నెలరోజులయినా ఇంకా మనుషుల్లో పడలేదా అని జోక్ చేస్తోంది.

"నిజంగానే మనుషుల్లో పడాలి శాంతా... నాకేదో అవుతోంది. చెవుల్లో హోరు వినిపిస్తోంది. ఊరికే పైట సవరించుకోవాలనిపిస్తోంది. నన్ను నేను భద్రంగా కప్పుకోవాలనిపిస్తోంది"

ప్రశాంతి ఒక నిముషం మాట్లాడలేదు.

"ఇంకా చెప్పు విశాల... ఇప్పుడు ఏమయింది?" ఈసారి అచ్చం డ్యాక్టర్‌లా అడిగింది. ఆవిడ గొంతు స్థిరంగా ఉంది. విషయం అర్థం అయింది.

విశాల చెప్పుకుపోతుంది. "ఇప్పుడు నేను నైటీలో ఉన్నానా... అయినా ఇబ్బందిగా ఉంది"

ప్రశాంత కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. విశాలని తను ఎరుగును. ఒక చైతన్యం, ఒక స్ఫూర్తి విశాల. ఆమె జారిపోతోంది. అంధకారంలో ఆమె కూరుకుపోకుండా కాపాడాలి.

"విశాలా..." ప్రేమగా తాకింది శాంతి గొంతు.

"ఇప్పుడు నిద్రపోగలవా..."

"ఊహూ... నిద్ర రాదేమో..."

"సరే విను... ఇప్పుడు ఇన్ని మైళ్ళ దూరం నేను వచ్చేసరికి ఆలస్యం అవుతుంది. నువ్వూ రాలేదు. రిలాక్స్‌డ్‌గా పడుకో. నువు చదువుకోవటం, పరీక్షలు, నీ ఇంటర్వ్యూ, నీ పోస్టింగ్ మొదటిరోజు గుర్తుకు తెచ్చుకో. వాటి గురించి ఆలోచించు..."

"శాంతి నాకెందుకిలా అవుతోంది..."

"నీకేం అయింది విశాల. యూ ఆర్ పర్ఫెక్ట్. కాసేపట్లో మామూలుగా అయిపోతావు. నీవెలా ఉండాలనుకొంటున్నావో నిన్నలా ఉంచే శక్తి నీ శరీరానికి ఉందని, నేను నీకు చెప్పనక్కరలేదు. ఇంతకు ముందో చిన్న బ్రేక్. నీ శరీరం కంగారుపడింది. అది ఏ రకంగా ఇంతకు ముందు సిద్ధం అయిందో, ఆ రకంగా ఉండేందుకు అవకాశం ఉండదేమోనని నీకు అంతరాంతరాలలో భయం వేసింది. నీ శరీరాన్ని, దాన్ని నువు ప్రదర్శించిన తీరుని ప్రకాష్ తిరస్కరించటాన్ని నువు భరించలేకపోయావు. నీ మనసుని గాయపరచిన, అవమానపరచిన ఆ అంశం, నీ శరీరాన్ని దాచుకోమని కోరింది. ఫరవాలేదు. నువు తెలుసుకుంటావు. నిన్ను నువు దాచుకొనే పనిలేదు. నీ స్వేచ్ఛపైన, నీ స్వభావం పైనా కంట్రోలింగ్‌ను భరించలేకపోయావు. రిలాక్స్ విశాలా... రిలాక్స్. నువు మేలుకున్న మనిషివి. నిన్నెవరూ లేపనక్కరలేదు. నువు మెలకువతోనే ఉన్నావు హాయిగా నిద్రపో... రేపు కలుద్దాం"

విశాల శ్రద్ధగా శాంతి మాటలన్నీ విన్నది. ఫోన్ పెట్టేసి, అడ్డదిడ్డంగా ఉన్న దిండ్లన్నీ పక్కనపెట్టి సోఫాలో పడుకుంది. విశ్రాంతిగా, హాయిగా గుప్పిట్లు తెరిచి అరచేతులు ముడుస్తూ తెరుస్తూ చూసుకుంది. తన అరచేతుల్లోనే భద్రంగా తన జీవితం. రిమోట్ ఎప్పుడూ తన చేతుల్లోనే. విశాల కళ్ళు మీదకు హాయిగా నిద్ర వచ్చేసింది. ★